లెక్క తేలేదెప్పుడో ?

'రాజీవ్ యువ వికాసం' లబ్ధిదారుల ఎంపికలో ఉత్కంఠ..! ● ఎదురుచూపులు చూస్తున్న దరఖాస్తుదారులు..

సనత్‌నగర్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలు ఎప్పుడెప్పుడా అని దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. పథకం కింద అసలు తాము లబ్దిదారులుగా ఎంపిక అవుతామా? లేదా? అన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో నెలకొంది. ఒకవేళ లబ్దిదారులుగా ఎంపిక అయితే రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు తాము ఎంచుకున్న యూనిట్ కింద తమ బ్యాంక్ అకౌంట్‌లో ఎప్పుడు డబ్బు జమ అవుతుంది..తాము ఎప్పుడు స్వయం ఉపాధిని ప్రారంభించుకోవాలనే ఆలోచనలు దరఖాస్తుదారులను తొలిచేస్తున్నాయి. ఈ నెల 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ పథకం కింద లబిదారుల జాబితా విడుదల అవుతుందని, రుణ పత్రాలు కూడా అందజేస్తారనే ప్రచారం జోరుగా సాగింది. కానీ అధికారులు తేల్చాల్సిన లబ్దిదారుల లెక్క తేల్చకపోవడంతో దరఖాస్తుదారులు వేసుకున్న లెక్కలు సైతం తప్పాయి. సికింద్రాబాద్ మండల పరిధి కిందికి వచ్చే రాంగోపాలపేట, బన్సీలాల్‌పేట, మోండా, బేగంపేట డివిజన్లతో పాటు మరికొన్ని ప్రాంతాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారిలో 7,350 మంది ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. అలాగే అమీర్‌పేట మండల పరిధి కిందికి వచ్చే అమీర్‌పేట, సనత్‌నగర్, ఎర్రగడ్డ తదితర డివిజన్ల వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన అనంతరం రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ కార్పొరేషన్లకు 1944 మందిని అర్హులుగా గుర్తించారు. నిర్దేశిత అన్ని ధృవీకరణ పత్రాలు సరిగ్గా ఉండడంతో పాటు దరఖాస్తుదారుల్లో గత ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందారా? ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా? వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి ఈ అర్హుల జాబితాను ఎంపిక జరిపారు. అయితే మండల రెవెన్యూ అధికారులు రూపొందించిన అర్హుల జాబితాను బ్యాంక్‌లకు పంపించగా దరఖాస్తుదారులకు సంబంధించి సిబిల్ స్కోర్ ఏవిధంగా ఉందో తెలుసుకుని లబ్దిదారుల జాబితాను తిరిగి మండల కార్యాలయాలకు పంపించాల్సి ఉంటుంది. కానీ బ్యాంక్‌ల నుంచి ఇంకా పూర్తి డేటా రాకపోవడంతో రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జాప్యం నెలకొంటున్నట్లు తెలుస్తోంది.


సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయం..

కార్పొరేషన్ల వారీగా అమీర్‌పేట, సికింద్రాబాద్ మండలాల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలు

కార్పొరేషన్	అమీర్‌పేట	సికింద్రాబాద్
ఎస్సీ	429	2,157
ఎస్టీ	111	121
బీసీ	622	168
ఈబీసీ	68	159
మైనారిటీ	691	1774
క్రిస్టియన్ మైనారిటీ	23	202

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



రాంగోపాల్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మెక్లోడ్ గూడ గ్రౌండ్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నల్లగుట్ట ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్యావరణ జాగ్రత్తను పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటుతున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు భవర్‌లాల్ సందీప్, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందజేస్తాం


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.శుక్రవారం పికెట్ క్యాంప్ కార్యాలయంలో 26 మంది లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పేదల ఆరోగ్య సంరక్షణలో భాగంగా సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌వోసీ లను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే మంజూరు చేసి వారికి అందజేస్తోందని దీంతో వారికి కార్పొరేట్ వైద్యం లభిస్తోందని చెప్పారు.

ఓయూలో నిజాం కాలేజీ విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: హాస్టల్ మెస్ కోసం ఓయూలో నిజాం కాలేజీ విద్యార్థులు ధర్నా చేపట్టారు. శుక్రవారం ఓయూ పాలన భవనం ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి నిజాం కాలేజీ విద్యార్థులు రెండు రోజులుగా మూసివేసిన హాస్టల్ మెస్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ఈఓపై ఫిర్యాదు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ, సూపరింటెండెంట్ హైమావతిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు ఎస్.ఎస్.రావు మాట్లాడుతూ ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లపై మంత్రి ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల సమావేశం వాయిదా వేయాల్సి వచ్చిందని తెలిపారు.అయితే స్థానిక ఎమ్మెల్యేతో సమీక్షా సమావేశం నిర్వహించారని అన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాని కోరారు.

ఖబరస్థాన్ సమస్యను పరిష్కరించండి

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ఖబరస్థాన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని తహ్రీక్ ఖబరస్థాన్ కమిటీ ప్రతినిధులు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమను కోరారు. ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ఖబరస్థాన్‌తో పాటు బ్రాహ్మణవాడీలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలం ఆక్రమణలతో ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానిక ఖబరస్థాన్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం కోట నీలిమతో సమావేశమై వివరించారు. 2009లో ప్రారంభమైన ఖబరస్థాన్ స్థల సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. స్పందించిన కోట నీలిమ ఆయా విభాగాల అధికారులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

స్వదేశీ ఆవిష్కరణ శక్తికి ఆపరేషన్ సిందూర్ ఉదాహరణ



'ఎంఎస్ఎంఈ ఎక్సలరేట్-2025' కార్యక్రమంలో అశోక్ అట్లూరి తదితరులు

సనత్‌నగర్: స్వదేశీ ఆవిష్కరణ శక్తి సామర్థ్యాలు ఏమిటో ఆపరేషన్ సిందూర్‌తో చాటిచెప్పామని ఫిక్కీ నేషనల్ డిఫెన్స్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కమిటీ కో చైర్, జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్ అట్లూరి తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను శక్తివంతం చేయడమే లక్ష్యంగా భారత వాణిజ్యం, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) ఆధ్వర్యంలో శుక్రవారం బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో ఏర్పాటుచేసిన ప్రతిష్టాత్మక 'ఎంఎస్ఎంఈ ఎక్సలరేట్-2025'ను ఎస్ఎస్ఐబీ జోనల్ హెడ్ సురేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ అట్లూరి మాట్లాడుతూ మన దేశంలో తయారైన డ్రోన్లు, డిటెక్టర్లు, జామర్లు, రాడార్లతో చైనా డ్రోన్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలు ఎంత బిజీగా ఉన్నా పరిశోధనలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సరైన మార్గాన్ని గుర్తించి దానిపై దృష్టిపెడితే విప్లవాత్మక మార్పులు సాధ్యమన్నారు. భారతదేశం అంతర్జాతీయంగా ముందంజలో నిలవాలంటే లోకల్ మార్కెట్లకే కాకుండా, ప్రపంచ మార్కెట్ల కోసం కూడా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఎస్ఎస్ఐబీ జోనల్ హెడ్ అండ్ జనరల్ మేనేజర్ సురేష్‌బాబు, ఫిక్కీ తెలంగాణ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కమిటీ చైర్మన్ రాధాకిషోర్, ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర మండలి చైర్మన్ వీవీ రామరాజు, దీప్తి గద్దం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే


బేగంపేటలో పర్యటిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బేగంపేట డివిజన్‌లో శుక్రవారం పర్యటించిన ఆయన రూ.76 లక్షల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకూనాయక్, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్‌వర్క్స్ డీజీఎం ఆశిఫ్, శానిటేషన్ డీఈ వెంకటేష్, ఎలక్ట్రికల్ ఏడీఈ శివదుర్గాప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

పార్కులో ఆహ్లాద వాతావరణం కల్పిస్తాం


పికెట్ పార్కులో పనులను పరిశీలిస్తున్న సీఈవో మధుకర్ నాయక్, భానుక నర్మద తదితరులు

రసూల్‌పురా: పికెట్ పార్కులో సీనియర్ సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో కలసి శుక్రవారం పికెట్‌పార్కును సందర్శించి పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్, అందమైన మొక్కలు, పార్క్ చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం తదితర పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపరిటెండేంట్ ఎం. దేవేందర్, శానిటరీ సూపరిటెండెంట్ ఆకుల మహేందర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: చిన్నారుల భవితవ్యం తరగతిలోనే ఉంటుందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి అన్నారు. సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపించడం ద్వారానే వారి భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత కొలను బాల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు బ్రహ్మచారి, మరీ, శ్రీదేవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసియా కప్ పోటీలకు లష్కర్ యువతి



సికింద్రాబాద్: సీతాఫలమండికి చెందిన సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి సీహెచ్ ప్రవల్లిక ఆసియా కప్ పోటీలకు ఎంపికైంది. చైనాలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ప్రవల్లికను అభినందించారు.

భారీ వృక్షాల తరలింపు



సనత్‌నగర్: అభివృద్ధి పనుల కారణంగా మూడు భారీ వృక్షాలకు నష్టం కలిగే అవకాశం ఉండడంతో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు నేతృత్వంలో వాటిని మరోచోటికి తరలించి నాటారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) సమీపంలోని నాలా వద్ద ఆక్రమణలను ఇటీవల హైడ్రా కూల్చివేసింది. ఈ నేపథ్యంలో అక్కడ అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనుల కారణంగా అక్కడ ఉన్న రెండు వేప చెట్లు, ఒక రావి చెట్టుకు నష్టం కలిగేలా ఉండడాన్ని ఆయన గుర్తించారు. దీంతో కంటోన్మెంట్ బోర్డుకు చెందిన సురేందర్, వేటా ఫౌండేషన్‌కు చెందిన మోహిత్‌ల సహకారంతో శుక్రవారం ఆ చెట్లను వేర్లతో సహా పెకిలించి బైసన్ పోలో గ్రౌండ్‌కు తరలించి విజయవంతంగా తిరిగి నాటారు. కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఆర్ఎస్ఐ అశోక్‌రెడ్డి, మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శ్రీధర్‌లు పాల్గొన్నారు.

పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న డా. స్వప్న

లాలాపేట: పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడి కేంద్రాలు కృషి చేస్తున్నాయనీ ఐసీడీఎస్ సికింద్రాబాద్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ జె. స్వప్న తెలియజేశారు. మెట్టుగూడ సెక్టార్ చంద్రబాబునగర్ అంగన్‌వాడి 1, 2 కేంద్రాల ఆధ్వర్యంలో అమ్మ మాట- అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లాలాపేట సత్యానగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఏ. రేణుక, మెట్టుగూడ సెక్టార్ చంద్రబాబునగర్ 1, 2 అంగన్‌వాడి కేంద్రాల టీచర్లు కృపావతి పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం


మేడిబావి జైభవానీ ఆలయం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్న ప్రాంతాల్లో పర్యటించారు. మేడిబావి జై భవానీ ఆలయం వద్ద డ్రైనేజీ నీరు ఓవర్ ఫ్లో అవుతున్న విషయాన్ని సాక్షి దినపత్రిక ప్రచురించిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ దుర్గా భవానీ దేవాలయం ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొత్తపైప్ లైన్ వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ కుషాల్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, వెంకట్, మస్తాన్ పాల్గొన్నారు.

అవగాహన తరగతులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు, రైల్వే నిబంధనలు పాటించని ప్రయాణికులకు రైల్వే రక్షకదళం పోలీసులు శుక్రవారం అవగాహన తరగతులు నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎం.వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ శ్యాంసుందర్ నేతృత్వంలోని బృందాలు పలు ప్రాంతాల్లో అవగాహన తరగతులు నిర్వహించారు.

ఆర్ట్స్ కాలేజీ ప్రవేశ ద్వారం మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రవేశ ద్వారాన్ని మళ్లీ మూసివేశారు.ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బయటి వ్యక్తుల వాహనాల పార్కింగ్ వలన గేటును మూసివేసినట్లు ప్రిన్సిపల్ ప్రొ.కాశీం వివరించారు. వాహనాల పార్కింగ్‌తో పాటు వివిధ రకాల పంచాయితీయులు, సెటిల్‌మెంట్లు, అనధికారికంగ సమావేశాలు, గొడవలు పెట్టుకోవడం వలన గేట్లను మూసివేసి వాహనాలను రాకుండా అడ్డుకుంటున్నట్లు చెప్పారు. కొంత కాలం తర్వాత సెక్యూరిటీని ఏర్పాటు చేసి గేట్లను తెరిచి ఉంచనున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయాలి

అడ్డగుట్ట: అర్హులైన వారికి సకాలంలో ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని కోరుతూ శుక్రవారం జై భీమ్ మాల మహాసంఘం నాయకులు మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆర్. మల్లేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కుల, ఆదాయ ఇతర ధృవీకరణ పత్రాల నిమిత్తం దరఖాస్తులు వస్తుంటాయని, అందువల్ల వాటిని త్వరితగతిన పరిశీలించి సకాలంలో సర్టిఫికెట్లు అందజేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. సంఘం నాయకులు ఆర్. మల్లేష్, ప్రసన్నలక్ష్మి, రమాదేవి, నర్సింగ్, అమర్, మహేందర్, సత్యనారాయణ, భారతి, ఉమ ఉన్నారు.

మంచినీటి లీకేజీలు... పట్టించుకోని అధికారులు


పద్మారావునగర్ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ నుంచి మంచినీటి లీకేజీ

బన్సీలాల్‌పేట్: మంచినీటి లీకేజీల కారణంగా తాగునీరు వృథా అవుతోంది. ఓ వైపు నీటి ప్రవాహం వల్ల రోడ్లు పాడవుతుండగా మారో వైపు నీటిలో నుంచి రాకపోకలు సాగించలేక వాహనచోదకులు...పాదచారులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. రోజుల తరబడి నుంచి మంచినీరు రోడ్లపై ఏరులైపారుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారనే విమర్శలు సర్వత్రావిన్పిస్తున్నాయి. బన్సీలాల్‌పేట్, బోయిగూడ, పద్మారావునగర్, మోండా మార్కెట్, రాణిగంజ్, మారేడ్‌పల్లి, ఆర్పీ రోడ్డు, రెజిమెంటల్ బజార్, గాంధీనగర్, జీరా, హైదర్‌బస్తీ, ఎస్డీ రోడ్డు, ఎంజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంచినీటి లీకేజీలు కొనసాగుతున్నాయి. పద్మారావునగర్ ప్రధాన రహదారిలో మ్యానుహోల్స్ నుంచి మంచినీరు రోజులు, నెలల తరబడి నుంచి వృధాగాపోతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని పలువురు సాక్షితో వాపోయారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి జలమండలి పైపుల ద్వారా నగరానికి నీటిని తరలించి ప్రజల తాగునీటి అవసరాలను తీర్చుతున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో మాత్రం లీకేజీల ద్వారా వృథా అవుతున్న మంచినీటి సమస్యను పరిష్కరించడం లేదనేది వాస్తవం.

అలా మరమ్మతు.. ఇలా లీకేజీలు..

కొన్ని ప్రాంతాల్లో లీకేజీలకు మరమ్మతుల చేస్తున్నా మున్నాళ్ల ముచ్చటగా తయారవుతున్నాయి. మరమ్మతుల కోసం జలమండలి ఎంతో ప్రజాధనాన్ని వెచ్చిస్తూ పూర్తి స్థాయిలో పరిష్కారం ఉండటం లేదనేది వాస్తవం, పద్మారావునగర్ కొతాకామకోటి కళ్యాణ మండపం సమీపంలోని ప్రధాన రహదారి ఇలా మరమ్మతులు చేస్తున్నారు తిరిగి అలాగే నీటి లీకేజీలు కొనసాగుతున్నాయి. అదే ప్రాంతంలో వేరే చోట మ్యానుహోల్స్ నుంచి మంచినీరు రోజుల తరబడి నుంచి నీరు రోడ్డుపై వృధాగా పోతున్నా స్థానిక జలమండలి సెక్షన్ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరించారని పలువురు స్థానికులు చెప్పారు.

సెక్షన్ అధికారుల క్షేత్ర స్థాయి పర్యటనలు అంతంతమాత్రమే

సికింద్రాబాద్ జలమండలి మారేడ్‌పల్లి డివిజన్ పరిధిలో పలు సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కొ సెక్షన్‌కు ఓ మేనేజర్ స్థాయి అధికారితో పాటు పలువురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో సెక్షన్ మేనేజర్లు పర్యటించి మంచినీటి లీకేజీలు, డ్రైనేజీ మురికినీటి ప్రవాహం ఇతరత్రా సమస్యలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. అయితే అనేక సెక్షన్ పరిధిలోని మేనేజర్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఆఫీసుల వరకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీంతో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా సకాలంలో సిబ్బంది స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మంచినీటి లీకేజీలను అరికడతాం

మంచినీటి లీకేజీలను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి డివిజన్ జీఎం వినోద్‌కుమార్ చెప్పారు. క్షేత్ర స్థాయిలో పర్యటనల ద్వారా ఈ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటామన్నారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు లీకేజీలను తెలుసుకొని మరమ్మతులు చేసే విధంగా చూస్తామన్నారు. లీకేజీలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకుంటామన్నారు.

– జీఎం వినోద్‌కుమార్

క్రైం కార్నర్..

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం


మహేందర్‌సింగ్

చిలకలగూడ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు.చిలకలగూడ ఎస్ఐ సబిత తెలిపిన మేరకు..జీడిమెట్లకు చెందిన మహేందర్‌సింగ్, నిషాలు భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. చెడువ్యసనాలకు బానిసైన మహేందర్‌సింగ్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. భార్య ఫిర్యాదుమేరకు మహేందర్‌సింగ్‌పై కేసు నమోదైంది. ఈ క్రమంలో మహేందర్ సింగ్ నామాలగుండులో ఉంటున్న సోదరుడు జగజీత్ సింగ్‌లో కలిసి ఉంటున్నాడు. ఇటీవల భార్య నిషా నామాలగుండు వచ్చి ఆరా తీయగా భర్త మహేందర్‌సింగ్ ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భార్య శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది.

వృద్ధురాలి అదృశ్యం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. మచ్చబొల్లారానికి చెందిన కమలమ్మ (70) ఈనెల 11న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఒక వ్యక్తి ఫోన్ నెంబర్ ద్వారా తన కుమారుడు తిరుపతిరెడ్డికి కాల్ చేసి తాను ఎక్కడ ఉన్నానో తెలియడం లేదని చెప్పి ఫోన్ పెట్టేసింది. ఆ తరువాత ఆమె ఎక్కడుందో తెలియరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... రైల్వేస్టేషన్ 6/7 ప్లాట్‌ఫామ్‌పై ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ప్లాట్‌ఫామ్ మీదకు వెళ్లిన పోలీసులు సదరు వ్యక్తి అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వివరాలు లభించలేదు.

సెల్ ఫోన్ దొంగల అరెస్ట్

సికింద్రాబాద్: జీఆర్‌పీ పోలీసులు ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను శుక్రవారం అరెస్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన అశోక్ చౌరాధ్య (70), సచిన్ తారాచంద్ గౌక్వాడ్ (34) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్ద సెల్‌ఫోన్‌లు చోరీలు చేస్తున్నారు. ఈనెల 10న రైల్వేస్టేషన్‌లో వాటర్ వెండర్ ఫోన్ లాక్కొని ఉడాయించారు. సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.